# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

# 23

**ఫిరోజ్‌షా ఆరోగ్యం కుదటపడుతోంది** కానీ మంచం దిగే పరిస్థితి నుండి ఇంకా కోలుకోలేదు. దేవరాయలతో ఒప్పందం జరిగిన వేంటనే గిసుదరాజ్ చేసిన మొదటి పని విజయనగర ఆస్థాన వైద్యుల్ని రప్పించడం. గిసుదరాజ్‌కి ఫిరోజ్‌షా కోలుకోవడమే ప్రధాన విషయం. ముందు సుల్తాన్ లేచి తిరగాలి. అతని ఆరోగ్యం కుదుటపడితే మిగతా రాజకీయాలూ, వ్యవహారాలూ చక్కబెట్టవచ్చు. ఫిరోజ్‌షాకి తగిలిన గాయాలు మొదట చిన్నగా అనిపించినా కాలంగడిచే కొద్దీ, కోతిపుండు బ్రహ్మ రాక్షసిలా తయారయ్యాయి. త్వరగా కోలుకుంటాడనుకున్న సుల్తాన్, రెండు మూడు వారాలు గడిచినా ఏ మాత్రం మార్పు లేకపోయేసరికి గిసుదరాజ్‌కి భయం పుట్టుకుంది. తామందరూ అపరిచిత శత్రు రాజ్యంలో చిక్కుకుపోయామన్న బాధ ఎక్కువయ్యింది. ఎలాగయినా ఈ గండం నుండి బయటపడాలనే ఫరూక్తో రకరకాల ఆలోచనలు చేసాడు. చివరకి దేవరాయలు చేసిన ప్రతిపాదన ఒప్పుకోక తప్ప లేదు. గత్యంతరం లేక గుల్బర్గా ప్రజల క్షేమం కాంక్షించి సుల్తాన్ తరపున తనే నిర్ణయం తీసుకున్నాడు. ఫిరోజ్‌షాకి చాలా విషయాలు తెలియవు. అతని బాధలో అతనున్నాడు.

దేవరాయలు విడుదలయ్యాక, ఫిరోజ్‌షా మకాం ఆనెగొంది కోటకి మార్చారు. సుల్తాన్ సైన్యానికి కావల్సిన ఏర్పాట్లన్నీ త్వరితగతిని దేవరాయలు చేయించాడు. దేవరాయల సేవకులు అన్ని సదుపాయాలు దగ్గరుండి సమకూరుస్తున్నారు. కొంత మంది వైద్యులు ఆనెగొంది కోటలోనే ఉంటున్నారు. ఫిరోజ్‌షాకి తగిలిన గాయాలకి పసర్లూ, లేపనాలు పూసి వైద్యం చేస్తున్నారు. ప్రతి దినమూ దేవరాయల వైద్యులు వచ్చి పర్యవేక్షిస్తున్నారు. ఫిరోజ్‌షా మెల్లగా కోలుకుంటున్నాడు. మంచం లేచి కూర్చునే స్థితికొచ్చాడు. ఆ సమయంలో గిసుదరాజు మొత్తం జరిగిన ఒప్పదం గురించీ వివరాలు చెప్పాడు.

"ఈ సమయంలోనా ఈ నిఖా ఏవిటి మౌల్వీ? ముందు మనం గుల్బర్గా చేరుకునే మార్గం చూడండి. తరువాత ఈ నిఖా సంగతి ఆలోచించవచ్చు," ఫిరోజ్‌షా అసహనంగా అన్నాడు.

"ఇంతకు మించి గత్యంతరం లేదు. ఈ పెద్ద ప్రమాదం నుండి గట్టెక్కడానికి ఇదొక్కటే మార్గం. దేవరాయలు మన బందీగా ఉన్నాడన్నదొక్కటే మనకు లాభించిన అంశం. మిగతావన్నీ మనకీ, మన ప్రాణాలకీ ముప్పు తెచ్చి పెట్టేవే!" మెల్లగ చెప్పాడు గిసుదారాజ్.

ఫిరోజ్‌షాకి అర్థం కాలేదు.

"అదెలా? మనం రాయచూరూ నుండి గంగావతి వరకూ ఆక్రమించుకున్నాం కదా?" ఎదురు ప్రశ్నించాడు.

"...అని నువ్వనుకుంటున్నావు. దేవరాయల సైన్యం మనల్ని వలయాకారంలో చుట్టు ముట్టారు. మనం కదిలే పరిస్థితిలో లేం. మరో యుద్ధం జరిగితే మనమందరం బ్రతికి బట్టకట్టే పరిస్థితి లేదు. నేను ఎంతో శ్రమ తీసుకొని వచ్చింది ఇందుకే! గుల్బర్గా సుల్తాన్ ప్రాణాలకి ముప్పు వాటిల్లడం ఎవరికీ మంచిది కాదు. మనం దేవరాయల్ని చంపేసామే అనుకో. అతని తమ్ముడో, లేకపోతే మరెవరూ అధికారం చేబడతారు. మనపై యుద్ధం ప్రకటిస్తారు. మన సైన్యం ఎంతచూసిన అయిదు వేల మంది లేరు. వందల వేలకి మించిన విజయనగర సైన్యం యావతూ మన మీద దాడి చేస్తే మనం నేలపాలు కావల్సిందే! ఆవేశం తగ్గించి జాగ్రత్తగా ఆలోచించు." నింపాదిగా చెప్పాడు.

ఫిరోజ్‌షా ఆలోచనలో పడ్డాడు. అహ్మద్‌ఖాన్‌కి మరింత బలగం పంపమని కబురంపాడు. అది అతనికి చేరలేదా? అన్న అనుమానం వచ్చింది.

గిసుదరాజు తెలివైన వాడు. అంతకు మించి సాత్వికుడూ, శాంతి కాముకుడూ కూడా. కేవలం సుల్తాన్ క్షేమమే కాదు, ప్రజల గురించి కూడా ఆలోచిస్తాడని ఫిరోజ్‌షాకి తెలుసు. తను అడ్డదారిని సుల్తాన్ అయినా, తనని సమర్ధించింది కేవలం గుల్బర్గా క్షేమం కోరేనన్న వాస్తవం అతను మర్చి పోలేదు. ఒక రకంగా చెప్పాలంటే గిసుదరాజు వల్లే గుల్బర్గా బ్రతికిందన్నదీ అతనికి బాగా తెలుసు.

"జరిగిందేదే జరిగిపోయింది. మీరు మా శ్రేయస్సుకోరి మంచి నిర్ణయాలే తీసుకుంటారని నాకు తెలుసు. మీరెలా చెబితే అలాగే చేద్దాం. మీరు చెప్పినట్లు ఈ నిఖా ఒప్పుకుంటున్నాను. కానీ ముందు మనం ఇక్కడనుండి మన మహలుకి వెళిపోదాం. కోలుకున్నాక నిఖాకి రావచ్చు," గుల్బర్గా వెళిపోదామన్న కోరికని పైకి చెప్పాడు ఫిరోజ్‌షా.

"గుల్బర్గాకి ఏవీ కాదు. జరిగినదంతా అహ్మద్‌ఖాన్‌కి కబురంపాను. ఈ నిఖా అయ్యేటంత వరకూ మనం ఇక్కడనుండి కదలడం క్షేమం కాదు. మనం ఈ రాజ్యం వదిలి వెళిపోయాక వాళ్ళ మనసులు మారచ్చు. నిర్ణయాలు వెనక్కి తీసుకోవచ్చు. ఒప్పందాలు కాల రాయచ్చు. ఇరు రాజ్యాల మధ్య వైరం మరింత పెరిగే అవకాశముంది. ముందు ఈ యుద్ధ సంస్కృతికి మనం స్వస్తి చెప్పాలి. ప్రజల క్షేమంకంటే రాజ్య విస్తరణ ప్రధానం కాదు. అదీకాక మనం ఇక్కడే ఉంటె ఒకరి మీద ఒకరికి నమ్మకం కలుగుతుంది. మాట్లాడుకునే అవకాశం వస్తుంది. అంతెందుకూ - ఈ ఒప్పందమయ్యాక దేవరాయలే రెండు మూడు సార్లు ప్రత్యేకంగా వచ్చి మనల్ని సందర్శించాడు. ప్రస్తుతం ఇరుపక్షాలకీ నమ్మకం చాలా అవసరం. ఒక్క తప్పడుగు వేసినా ప్రాణాలకే ముప్పు. ఇంకో రెండు వారాల్లో నువ్వు కోలుకుంటావు. తరువాత నిఖా ఏర్పాట్లు చెయ్యమని చెబుతాను. ఈ నిఖా వల్ల ఇరువురు సుఖంగా ఉంటే అదే చాలు." తన మనసులో ఉన్నదంతా చెప్పాడు.

గిసుదరాజ్ పక్కనే ఉన్న ఫరూక్ కూడా ఆ నిర్ణయాన్ని సమర్ధించాడు. కొంత సేపు మిగతా విషయాలు మాట్లాడుకున్నాక, లేచి వెళ్ళబోతూ గిసుదరాజే అన్నాడు.

"నీకు దేవరాయల కూతుర్ని చూడాలని ఉందని కబురు పంపనా?"

"ముందు నన్ను లేచి తిరిగనీయండి. నిఖా సంగతి తర్వాత ఆలోచించవచ్చు. ఇంతకీ ఆ అమ్మాయి వయస్సెంత?"

దేవరాయలు తన వయసువాడన్న విషయం ఫిరోజ్‌షాకి గుర్తొచ్చి అడిగాడు. ఇంత వరకూ ఆనెగొంది కోట దాటి ఎవరూ బయటకి వెళ్ళలేదు. దేవరాయల గురించి వివరాలు అంతగా తెలియవు అతనికి. ఫిరోజ్‌షా వయసు ఏభై దాటింది. అతనికి ఈ నిఖా మీద అంత సుముఖతలేదు. కానీ పైకి చెప్పలేడు.

"బహుశా పంతొమ్మిదేళ్ళు ఉండవచ్చు. నేనూ చూడలేదు. చూడాలని ఉందని కబురంపుతాను, ఏం?"

"అంత చిన్న వయసు పిల్లని...?" సంశయం వ్యక్తం చేసాడు ఫిరోజ్‌షా.

"మన సున్నీ సంప్రదాయంలో అదేవీ తప్పు కాదు. అయినీ ఏదో తటపటాయిస్తున్నావు. ఏవిటి?" గిసుదరాజుకి సుల్తన్ మనసులో ఏవుందో అర్థం కాలేదు. కొంతసేపయ్యాక ఫిరోజ్‌షా మెల్లగా అన్నాడు.

"పోనీ మన హసన్‌కిచ్చి ఈ నిఖా చేస్తే....?"

"బాగానే ఉంటుంది కానీ, మనం ఇప్పటికే అన్నీ అంగీకరించేసాం. ఇప్పుడు ఇలా మాట మారిస్తే వాళ్ళకి మనమీద నమ్మకం సడలవచ్చు. కొన్ని కొన్ని నిర్ణయాలు మనకి నచ్చకపోయినా చెయ్యాల్సుంటుంది. అందులో మనకి లాభం కంటే ఎదుటి వారి క్షేమమే గొప్పది. ఇదంతా గుల్బర్గా ప్రజల శాంతి కోసం. హసన్‌కి వయసయితే వచ్చిందికానీ దానికి తగ్గ పరిపక్వత రాలేదు. ఒకవేళ హసన్‌తో

చేసామే అనుకుందాం? ఈ నిఖా తరువాత ఏదైనా పొరబాటు జరిగితే దానికందరం బాధ్యులమే! ఎందుకొచ్చిన తలనొప్పి చెప్పు. ఈసారికిది తప్పదు. నా మాట కాదనకు.”

ఫిరోజ్‌షా సరేనన్నట్లు తలాడించాడు. గిసుదరాజు ఇహ పొడిగించలేదు.

*000000000000*

విజయనగరంలో జరిగిన అనూహ్య పరిణామల తరువాత ఉమాదేవీ, నరేంద్ర గజపతీ కాస్త వెనక్కి తగ్గారు. నర్రేద గజపతికి చాలా విషయాలు తెలియడం లేదు. అసలు దేవరాయల కూతురు మంజరిని ఒక ముస్లిం సుల్తానికిచ్చి వివాహమేవిటో అర్థం కావడం లేదు. అసలు దేవరాయలు బందీ అయ్యాక అక్కడ ఏం జరిగిందో కూడా తెలీదతనికి. ఎంత ప్రయత్నించినా ఎవరూ పైకి చెప్పడం లేదు. అక్క ఉమాదేవిక్కూడా చిన్న చిన్నగా విషయాలు తెలుస్తున్నాయి తప్ప అసలేం జరిగిందో బోధపడడం లేదు.

అసలు దేవరాయలు కూడా తన అందుబాటులో ఉండడం లేదు. క్రమం తప్పకుండా తన మందిరానికి విచ్చేసే మహారాజు ఎప్పుడో వీలుకుదిరినప్పుడు మొహం చూపించి వెళిపోతున్నాడు. ఆమె కూడా నిలదీసి అడిగే ధైర్యం చెయ్యలేకపోతోంది. నరేంద్రగజపతి ముద్గల్లో చేసిన నిర్వాకమంతా దేవరాయలకి తెలిసి మండిపడ్డాడు. కానీ ఉమాదేవి దగ్గర బయటపడలేదు. నరేంద్ర గజపతినీ ఏవీ అనలేదు. కానీ రాజ్య వ్యవహారాలకి అతన్ని దూరంగా ఉంచమని తన వాళ్ళందరికీ చెప్పాడు. ఫిరోజ్‌షా ఇంత హఠాత్తుగా ఎందుకు దండెత్తాడో మాత్రం నర్రేద గజపతికి అర్థం కాలేదు. తనని పక్కకు పెట్టడం భరించలేకపోతున్నాడు నరేంద్ర గజపతి. అలాగని మహారాజుని అడిగే ధైర్యం లేదు. ఉమాదేవి కూడా దేవరాయలపై విసుగు తరచుగా తనపై ప్రదర్శిస్తోంది.

అసలు మంజరిని వివాహం చేసుకోవల్లన్న ఆలోచన నరేంద్ర గజపతికి ఉంది. తద్వారా రాజ్యంలో స్థానం సంపాదించవచ్చు. తనకీ ఒక స్థావరం ఏర్పరుచుకోవచ్చనే అవకాశాలున్నాయని తలచేవాడు. కానీ ఈ ప్రతిపాదనకి ఉమాదేవి సుతారామూ ఒప్పుకోలేదు. తమ్ముడికి మేలు కంటే తన సవతిపై అక్కసే ఎక్కువ. ఒకవేళ ఆ పెళ్ళే జరిగితే నరేంద్ర జగపతిని మంజరి ఎక్కడ మార్చేసి తనకి ఎదురు తిరిగేలా చేస్తుందేమోనన్న భయం. ఎందుకొచ్చిన తంటా? ఎంత దూరంగా ఉంచితే అంత మంచిదని తలచీ నరేంద్రగజపతి ఆశలపై నీళ్ళు జల్లేసింది.

ఇది నరేంద్ర జగపతికి మింగుడుపడకపోయినా అక్కపై కోపాన్ని పైకి కక్కలేక ఊరుకున్నాడు. కానీ ఇంతలో మంజరిని హఠాత్తుగా ముక్కూ మొహం తెలియని ఒక శత్రు రాజుకి కట్టబెట్టడం సహించలేకపోతున్నాడు. అలాని దాన్ని ఎదుర్కునే శక్తీ, బలగం రెండూ లేవు. అవకాశాలన్నీ చేజారిపోతున్నాయన్న బాధ, కోపమూ ఎక్కువవుతున్నాయి. ఎలాగయినీ ఈ వివాహాన్ని రద్దు చేయాలా? అని ఆలోచిస్తున్నాడు. మంజరిని కలుద్దామని అనుకున్నాడు. కానీ తనపై మహారాజు నిఘా వేసాడని తెలిసాక ఒకడుగు వెనక్కి వేసాడు. ఏం చెయ్యాలో తెలీని పరిస్థితి. కానీ ఏదో ఒకటి చెయ్యాలి?

*0000000000000000*

చూస్తుండగా రెండు వారాలు గడిచిపోయాయి. ఫిరోజ్‌షా పూర్తిగా కోలుకున్నాడు. పూర్వపు శక్తీ, ఓపికా లేకపోయినా లేచి తిరుగుతున్నాడు. చేతికి తగిలిన గాయాలకి నొప్పి ఇంకా మిగిలినా మెల్లగా తగ్గుతున్నాయి. దేవరాయలు కూడా రెండు మూడు సార్లు వచ్చి చూసి పలకరించి వెళ్ళాడు. ఇరు పక్షాలు సంధికోసం తమ ప్రయత్నాలు తాము చెస్తున్నారు. ఎవరూ ఒక్క మాట కూడా జారకుండా ప్రతీ అడుగూ ఆచి తూచి వేస్తున్నారు. ఇహ రెండు మూడు వారాల్లో నిఖా ఏర్పాటు చెయ్యాలని గిసుదరాజు తొందర పెట్టసాగాడు. మంచి ముహూర్తం చూసి నిఖా ఏర్పాటు చేస్తానని చెప్పాడు దేవరాయలు. ఇంతకీ ఈ నిఖా ఎవరి పద్ధతీ, సాంప్రదాయం

బట్టి చేయాలన్న సమస్య వచ్చింది. గిసుదరాజు సున్నీ పద్ధతి ప్రకారం చేస్తే బావుంటుందని సెలవిచ్చాడు. ఆడపిల్ల వారి సంప్రదాయం చేయడం విజయనగర ఆచారమనీ దేవరాయలన్నాడు. ఇదంతా చూసి ఫిరోజ్‌షాకి చికాకు కలిగింది. ఏదో ఒక పద్ధతిని కానిచ్చేయమని చెప్పాడు. అతనికి ఈ నిఖా ముగించుకొని ఎప్పుడు గుల్బర్గా వెళదామాని వుంది.

చిత్రం ఏమిటంటే ఇంతవరకూ దేవరాయలు తన మందిరానికి ఫిరోజ్‌షాని ఆహ్వానించలేదు. కనీసం తన కూతుర్ని కూడా తీసుకొచ్చి ఫిరోజ్‌షాకి చూపించలేదు. అమ్మాయిని తీసుకొచ్చి చూపించకపోయినా దేవారాయలు తనని పిలవలేదన్నది చూసి ఫిరోజ్‌షా అహం దెబ్బ తింది. ఇదే విషయం గిసుదరాజు వద్ద ప్రస్తావించినా ఇవేమీ పట్టించుకోవద్దని చెప్పాడు. గిసుదరాజు మాటని ఖండించలేక మాట్లాడకుండా ఊర్కున్నాడు.

హిందూ సంప్రదాయ ప్రకారం చేద్దామని దేవరాయలు చెప్పినా ఎవరూ అభ్యంతర పెట్టలేదు. కానీ ఏమాత్రం హడావిడిలేకుండా మామూలుగా ఈ నిఖా ఏర్పాటు చెయ్యమని మాత్రం ఫిరోజ్‌షా చెప్పాడు. దేవరాయలూ సరే నన్నాడు. ఎంత లేదన్నా విజయనగర మహారాజు కుమార్తె వివాహం. వద్దనుకున్నా వైభోగం ఉంటుంది. ప్రజలందర్నీ పెళ్ళికి పిలవకపోయినా కేవలం రాజకుటుంబీకుల్నీ, బంధువుల్నీ పిలుద్దామనీ అనుకున్నాడు. మంచి ముహూర్తం చూసి తన ముగ్గురు పత్నులతో కలిసి ఫిరోజ్‌షాని వచ్చి కలిసాడు. కూతుర్నీ తనతో తీసుకు వచ్చాడు.

మంజర్ని మొదటి సారి చూసాడు ఫిరోజ్‌షా. తన తండ్రికి సమ వయస్కుడైన ఫిరోజ్‌షాని చూసి ఆశ్చర్యపోయింది మంజరి. కానీ పైకి అనలేని అసక్తురాలిగా నిర్వీర్యంగా ఉంది. ఈ పెళ్ళిలో ఆమె ప్రమేయం లేదు. కానీ అది జరిగేది తనకే!

ఈ సారి దేవరాయలు మందీ మార్బలంతో వచాడు. వస్తూనే అనేక కానుకలూ, బంగారు భరణాలూ, మణులూ, మాణిక్యాలూ, ఒకటేమిటి ఎన్నో బహుమానాలు తీసుకొచ్చాడు. ఫిరోజ్‌షాకి ప్రత్యేకంగా దుస్తులు కుట్టించాడు. ఇంతవరకూ ఏదో మాములుగా జరిగిన చర్చలన్నీ చూసాక, విజయనగరమేమంత గొప్ప రాజ్యం కాదని అనుకున్నాడు ఫిరోజ్‌షా. కానీ ఈ సారి దేవరాయల వైభవం చూసాక అతనికి మతి పోయింది.

వచ్చే శుక్రవారం నిఖా ముహూర్తమనీ అంత వరకూ ఫిరోజ్‌షాకి కాబోయే అల్లుడి హోదాలో ఏర్పాట్లు చేయించాడు. ప్రత్యేకంగా అలంకరించిన రథాలూ, అశ్వాలూ ఇవన్నీ ఫిరోజ్‌షాకి అందుబాటులో ఉంచాడు. మొత్తం ఆనెగొంది కోటంతా అలంకరించమని ఆదేశించాడు. అంతవరకూ యుద్ధ వాతావరణం ఉన్న ప్రదేశం హఠాత్తుగా పండగ వాతావరణం వచ్చేసింది. ఇరు పక్షాల సైనికులందరి మొహాల్లోనూ సంతోషం చిగురించింది. గిసుదరాజే ఫిరోజ్‌షా తరపున పెళ్ళి పెద్దగా ఉన్నాడు.

శుక్రవారం పెళ్ళి ముహూర్తమని చెబుతూ, ఫిరోజ్‌షాకి సపరివారానికి రాజమందిర సమీపంలో తమ కోట ప్రాంగణంలో విడిది ఏర్పాట్లు చేసామని చెప్పాడు. ఈ పెళ్ళికి గిసుదరాజ్ తరపున ఎవరూ గుల్బర్గా నుండి రాలేదు. అహ్మద్‌ఖాన్‌కి అన్ని విషయాలూ ఎప్పటికప్పుడు చేరవేస్తున్నా ఈ నిఖాకి రావల్సిన అవసరం లేదని చెప్పాడు గిసుదరాజు. ఇరు పక్షాలకీ ఇదొక తప్పని తంతు. ఇష్టాయిష్టాల కతీతంగా అనీ జరిగిపోతున్నాయి. ఇందులో అందరికీ సంతోషం కంటే లాభ నష్టాలే ముఖ్యంగా వుంది.

చూస్తూండగా గురువారం వచ్చేసింది. విందులూ, వినోదాలతో విజయనగర కోట దద్దరిల్లిపోయింది. విజయనగరంలో అడుగిపెట్టి అయిదు వారాలు దాటినా ఫిరోజ్‌షా ఆనెగొంది కోట దాటి బయటకి రాలేదు. పెళ్ళికొడుకుగా ముస్తాబయ్యి విజయనగర విడిదికి బయల్దేఱాడు. రథమ్మీద తన పక్కన గిసుదరాజు కూర్చున్నాడు. వెనుకనే ఫరూక్, మిగతా సైనికాధికారులూ వచ్చారు. ఆనెగొంది దాటి విజయనగర వీధుల్లోకి అడుగు పెట్టగానే ఫిరోజ్‌షాకి మతి పోయింది. ఆశ్చర్యంతో చూస్తూ ఉండిపోయాడు. ఇదే పరిస్థితి గిసుదరాజుదీ! వీళ్ళే ఇలా అనుకుంటే మిగతా వారి సంగతి చెప్పనవసరం లేదు.

విజయనగరం వీధులంతా జనం బారులు తీరి వెళ్ళని చూస్తున్నారు. ఎటు చూసినా పెద్ద పెద్ద భవనాలూ, మేడలూ ఉన్నాయి. వీధులన్నీ ఎంతో విశాలంగా, రాచబాటకిరువైపులా పచ్చని చెట్లతో కళకళలాడిపోతున్నాయి. ప్రతీ ఇల్లూ రంగురంగుల పూలతో అలంకరించబడి ఉంది. స్త్రీలూ, పురుషులూ విలువైన వస్త్రాలూ, భరణాలు ధరించి వున్నారు. విజయనగర సంపదా, సౌభాగ్యమూ వారి మొహల్లోనే కనిపిస్తోంది. విజయరనగర వైభవం ముందు గుల్బర్గా దిగదూడుపే అనుకున్నాడు ఫిరోజ్‌షా. ఎటుచూసినా అంగళ్ళూ, సత్రాలూ, చావళ్ళూ ఒకటేవిటే చూడ్డానికే ఇంత సుందరంగా ఉంటే, అసలు ఇలాంటి ప్రపంచాన్ని తామెప్పుడూ చూసెరగరనుకున్నారు గిసుదరాజూ, ఫిరోజ్‌షానూ. విజయనగరం ఊళ్ళోనే ఇంత సుందరంగా ఉంటే కోట గుమ్మం వద్దకొచ్చేసరికి మరింత విస్తుపోయాడు. చూట్టూ ఎత్తైన ప్రాకారాలూ, ప్రధాన కోట ప్రాకారం వద్ద లోతైన కందకాలూ ఇవన్నీ చూసి ఆశ్చర్యపోయారు.

కోటలోకి ప్రవేశించగానే మరింత విస్తుబోయారు. ఎటుచూసినా రంగురంగుల అలంకరణలతో ఆ ప్రదేశం సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దారు. కోట బురుజులూ, రాతి మందిరాలూ, భవనాలూ, దేవాలయాలూ అన్నీ ఒకదనికొకటి పోటీ పడుతూ వున్నాయి. అంగళ్ళలో రత్నాలూ, మణులూ వంటివి రాసులు పోసి అమ్మడం చూస్తూంటే నోట మాట లేదు ఫిరోజ్‌షాకి. ఇంతవరకూ సుల్తానుల వైభవాన్నే చూసాడు తప్ప ప్రజల వైభవాన్ని చూసెరగడు. విజయనగరంతో పోల్చి చూస్తే గుల్బర్గా రాజ్యం ఎందుకూ పనికిరాదని అర్థమయ్యింది. ప్రజలందరూ ఇంత ధనవంతులుగా చూడడం ఇదే ప్రథమం అతనికి. ఇంత పెద్ద కోటనీ చూడ్డం అతని జీవితంలో ఇదే ప్రథమం. కలో, నిజమో తెలియనంత మాయలా అనిపించింది. కోట ప్రారంభంలోనే ఇంత వైభవం ఉంటే ఇహ ప్రధాన మందిరాలు ఎంత గొప్పగా ఉంటాయోకదాని ఎవరికి తగ్గ ఊహలు వాళ్ళు చేసేసుకుంటున్నారు. కోట ప్రాంగణంలోనే అనేక అశ్వశాలలూ, గజశాలలూ ఉన్నాయి. అన్నింటికన్నా ఎంతో విస్మయ పరిచిన విషయమేవిటంటే కోట ప్రాంగణం ఒక్కటే ఒక మహానగరంలా ఉంది. ఇంత జన సమ్మేళనం తామెప్పుడూ చూసెరగరు. స్త్రీలూ,పురుషులూ, పిల్లలూ అందరూ ఎంతో సంతోషంగా కనిపిస్తున్నారు.

"ఢిల్లీ సుల్తానులనీ చూసాను. కానీ ఈ ప్రజల మొహాల్లో ఇంత సంబరానీ, సంతోషాన్నీ నేనెప్పుడూ చూసెరగను. సుల్తాన్! మన గుల్బర్గా కూడా ఒక విజయనగరం కావాలి. ఇన్నాళ్ళూ విజయనగర వైభవం గురించి చెబుతూంటే గోరంతలు కొండతలుగా చేసి చెబుతున్నారని విశ్వసించే వాణ్ణి. కానీ ఇదంతా ప్రత్యక్షంగా చూసినతరువాత అవి మనం చేరుకోలేని మహాపర్వతాలని తెలుస్తోంది. ఇన్నాళ్ళూ మన సుల్తానులు విజయనగరాన్ని ఎందుకు ఆక్రమించుకోవడానికి ఉవ్విళ్ళూరుతారా అనుకునేవాణ్ణి. ఇంత ధన సంపదా, సౌభాగ్యం చూసాక ఎవరికి కన్నుగొట్టదు చెప్పు. ఎంత వైభవం! ఆహా! మతిపోతోంది కదా!" గిసుద్రాజు నమ్మలేనట్లుగా అన్నాడు.

అక్కడ ఆశ్చర్యం అనంతగా సాగిపోతోంది. అందులో ఒక పక్క ఈర్ష్య ఉనా, తెలియని సంతోషం అందర్నీ ఆవహిస్తోంది. సువాసనలనీ, సంతోషాలనీ అడ్డుకోవడం ఎవరి తరమూ కాదు.

విడిగి గృహం చేరుకున్నాక మరింత విస్తుబోయారు  భవనం చూసి. నాలుగంతస్తుల రాతి భవనం రంగురంగుల పూలతో అలంకరించబడింది. భవనానికి క్రోసు దూరం నుండే ఇరువైపులా రంగవల్లులతో మొత్తం బాటంతా కళకళలాడుతూ వుంది. భవనం వద్ద దేవరాయలు సతీసమేతంగా ఆహ్వానించాడు. అనేక కానుకలతో కాబోయే అల్లుణ్ణి సత్కరించాడు. మొత్తం కోత చావడీ అంతా రంగు రంగుల తివాచీలు పరిచున్నాయి. ఎంతో విశాలమైన  భవనంలో పైన అమర్చిన కిటికీల ద్వారా వెలుతురు అక్కడున్న తెరలపై పడి మరింత మెరుస్తున్నాయి. ఎటుచూసినా చందనపు సింహాసనాలూ, కూర్చోడానికి బల్లలూ సుందరంగా అలంకరించబడ్డాయి. గోడలనిండా రంగురంగుల వర్ణ చిత్రాలూ, శిల్ప సౌందర్యంతో తలతిప్పుకోకుండా చేస్తున్నాయి. మగపెళ్ళి వారికోసం ఏర్పాటు చేసిన విందులో రకరకాల పిండివంటలూ, తినుబండారాలూ, పానీయాలూ, చెప్పనలవి కానట్లుగా ఉన్నాయి. ఫిరోజ్‌షా పైకి నవ్వుతూనే ఉన్నాడు కానీ ఇదంతా చూసి లోలోపల అసూయతో కుతకుత లాడిపోతున్నాడు. ఎలాగైనా ఈ విజయనగరాన్ని స్వాదీన పరుచుకోవాలన్న కోరిక అతనిలో మరింత బలపడింది.

మర్నాడు శుక్రవారం పెళ్ళి జరిగింది. రాజ కుటుంబీకులందరూ విచ్చేశారు. అందరూ సంతోషంగా పైకి కనిపిస్తున్నా లోపల ఈ తురక సుల్తానుతో రాజకుమారి వివాహం ఏవిటని విసుక్కున్నారు. మంజరి మాత్రం నిస్తేజంగా ఉంది. తండ్రి ఆడుతున్న రాజకీయ చదరంగంలో తానొక పావుగా మారిందని బాధపడింది.  సాయంత్రం వివాహమ నిఖా జరిగింది. ఒక హిందూ రాజ్యమూ, ముస్లిం రాజ్యమూ బంధుత్వపు ఒప్పందాన్ని మోదించాయి. చిత్రం ఏవిటంటే ఎవరూ ఆనందంగా ఆమోదించిన బంధుత్వం కాదిది. బలవంతపు బంధుత్వాలకి ఆలంబన స్వార్థమొక్కటే!

ఇష్టంలేని పెళ్ళీ, అయిష్టమయిన మొదటి రాత్రీ మంజరిని స్థాణువులా చేసాయి. ఫిరోజ్‌షా భాష తనకి రాదు. తను చెబుదామనుకున్నా అర్థంకాని పరిస్థితి సుల్తానుది. ఒకరి భాష ఒకరికి రాదు. ఒకరి మనసు ఇంకొకరికి తెలీదు. మంజరితో నిఖా దేవరాయలపై విజయమే అని భావించాడు ఫిరోజ్‌షా.  రాత్రి భారంగా గడిచింది ఆమెకి. అన్నీ అప్రయత్నంగా కదిలిపోతున్నాయి. ఒక్క కాలం తప్ప.

***000000000000000***

వివాహమయిన తరువాత సుల్తాను ఫిరోజ్‌షాని రాచమర్యాదలతో సత్కరించాడు. ముఖ్యంగా గిసుదరాజుని. విజయనగర సంస్కృతీ, వైభవం చూసి ముచ్చట పడిపోయాడు గిసుదరాజు. ముఖ్యంగా అతన్ని కట్టుకున్నది ప్రజల మొహాల్లో సంతోషం. వున్న నాలుగు నాళ్ళూ ఇక్కడి పాలనా వ్యవహారాల గురించీ, ప్రజా కార్యక్రమాల గురించీ తెలుసుకున్నాడు. విజయనగరంలో శిక్షలు కఠినంగా ఉంటాయనీ, ప్రజలందరూ ఎంతో క్రమశిక్షణతో ఉంటారనీ తెలుసుకున్నాడు. ఎక్కడా దొంగతనాలూ, అన్యాయాలూ జరగవనీ, ఒకవేళ్ జరిగి పట్టుబడితే మరణ దండన తప్పదని విన్నాడు. దేవరాయల అనుచరగణాన్ని చూసాక ప్రజల్ని పాలించడానికి సమర్థవంతమైన బృందం కావాలనిపించింది. గుల్బర్గా సుల్తానులకి రాజ్య కాంక్షే తప్ప పరిపాలనా అవగాహన లేదని అనుకున్నాడు. ఇప్పుడిప్పుడే గుల్బర్గా కోలుకుంటూండగా ఈ యుద్ధం వచ్చి పడింది. ఆరా తీస్తే అసలు విజయనగరంలో యుద్ధం మాటే రాలేదని తెలుసుకునాడు. మరి అహ్మద్‌ఖాన్ వద్దకి వచ్చిన వేగు అలా ఎందుకు చెప్పాడో, ఎక్కడ తేడా వచ్చిందో అర్థం కాలేదు. మొత్తం సుఖాంతమాయి, శాంతి చేకూరింది కదాని సంబరపడ్డాడు.

చేసుకున్న ఒడంబడిక ప్రకారమూ విలువైన కానుకలూ, ధనమూ, బంగారమ్మూ, కొన్ని వేల మొహరీలు ఫిరోజ్‌షాకి సమర్పించుకున్నాడు దేవరాయలు. తాను వీలు చూసుకొని గుల్బర్గా వస్తానని చెప్పాడు. ఫిరోజ్‌షా కూడా వారందరినీ తమ తిథ్యం స్వీకరించడానికి గుల్బర్గా రమ్మనమని ఆహ్వానించాడు.

వివాహమయ్యాక కూతుర్ని అత్తవారింటికి సాగనంపడానికి సంసిద్ధుడయ్యాడు దేవరాయలు. మంజరి తల్లి కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది. పరాయి రాజ్యంలో అడుగుపెడితే తనకూతుర్ని చంపేశ్తారన్న భయం వహించుకుందామెకి. తల్లికి ధైర్యం చెప్పి బయల్దేరింది మంజరి. తను ఎప్పుడు రావాలనుకున్నా పంపించే ఏర్పాట్లు చెయ్యమని తండ్రినీ, ఫిరోజ్‌షానీ అర్థించింది. ఆమెకి లోలోపల తెలుసు. ఒక్కసారి విజయనగర రాజ్యం దాటితే తాను ఎక్కువకాలం జీవించదని.

అయినా తప్పని పరిస్థితి. దేవరాయలు కూతురి ముందు కపట ప్రేమని ప్రదర్శించాడు. మంజరి ఒక్క మాట కూడా మాట్లాడ లేదు.

విడిది గృహం నుండి మొదటి రథంలో సుల్తాన్ ఫిరోజ్‌షా, మంజరీ బయల్దేరారు. వెనుకనే గిసుదరాజూ, వారి వెనుకనే దేవరాయలూ కొత్త దంపతుల్ని సాగనంపడానికి బయల్దేరాడు. ఆనెగొంది కోటలో  మార్నాడు ఉండి, దివారానికల్లా ఫిరోజ్‌షా, అతని సైన్యం గుల్బర్గా తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకున్నారు.

ఆ రథాలు విజయనగర కోట ప్రాంగణంలో వెళుతూంటే ప్రజలందరూ దారిపొడుగునా పూలు జల్లుతూ వీడ్కోలు చెప్పారు. ఇరవై క్రోసుల చదరపు వైశాల్యమున్న విజయనగర కోటంతా ఒకసారి తిరిగి రథాలు ఆనెగొంది వైపుగా వెళ్ళాయి.

ఆనెగొంది కోట చేరుకున్నాక ఫిరోజ్‌షా ముందు రథం దిగి మంజరినీ, మిగతా వాళ్ళనీ లోపలికి పంపించాడు. వెనుకనే గిసుదరాజు రథంలో ఫరూకూ, గిసుదరాజూ దిగారు. తమ వెనుకే బయల్దేరిన దేవరాయల రథం కోసం చూస్తున్నారు. మిగతా సపరివారమంతా వచ్చారు కానీ దేవరాయల రథం ఎంతసేపటికీ రాలేదు. అక్కడున్న అధికారులని ప్రశ్నించాడు ఫిరోజ్‌షా.

"దేవరాయల మహారాజు వారి రథం విజయనగర కోట ప్రాంగణం వద్దే వెనుదిరిగిపోయింది సుల్తాన్! మరి కొంతసేపయ్యాక వస్తారేమో తెలియదు." అని సమాధానం చెప్పాడు ఒక అధికారి.

"అదేవిటి? మాతో పాటు ఇక్కడి వరకూ వస్తారని అనుకున్నామే? కోట వద్దే వెనుదిరిగారా? ఆశ్చర్యంగా ఉందే?" అంటూ గిసుదరాజ్ అన్నాడు.

ఇది విని ఫిరోజ్‌షాకి అరికాలు కోపం నెత్తికెక్కింది. అసలే అసూయతో లోపల భగ్గుమంటున్న దానిపై ఆజ్యం పోసినట్లయ్యింది. ఇంటి అల్లుణ్ణి విడిది వరకూ సాగనంపాలన్న గౌరవమూ, సంస్కారమూ లేదాని గట్టిగా విరుచుకు పడ్డాడు. కోపం వద్దనీ, శాంతించమనీ చెప్పాడు గిసుదరాజ్.

మొదటినుండీ దేవరాయల ప్రవర్తన ఫిరోజ్‌షాకి నచ్చడం లేదు. అతని మాటలు ఎంతో కృతకంగా అనిపించాయి. అతన్ని చంపకుండా వదిలిపెట్టిన కృతజ్ఞత కూడా దేవరాయల మాటల్లో కనిపించలేదు ఫిరోజ్‌షాకి. ఏదో ఒక రాజకీయ ఒప్పందంలానే నడచుకున్నాడు తప్ప ఇరురాజ్యాల మధ్య శాంతినీ, సంధినీ నడుపుదామన్న తీరు కనిపించలేదు. కానీ గిసుదరాజు మాటల్ని కాదనలేక ఇంత సేపూ మిన్నకున్నాడు.

"చూసారా మౌల్వీ? అతని పొగరు. ఇంటి అల్లుణ్ణి గౌరవించకుండా అవమానించాడు. మనతో ఒక్క మాట కూడా చెప్పకుండా కోట గుమ్మం వద్దే వెనక్కెళ్ళిపోయాడు. ఎంత నిర్లక్ష్యం? మనతో అతనికి అవసరం లేదన్నట్లు ప్రవర్తించాడు. మొదటనుండీ అతని ప్రవర్తన నాకు మింగుడు పడడం లేదు. మీ మాట కాదనలేక నోరు మూసుకొని కూర్చున్నాను." అంటూ ఆవేశంతో రెచ్చిపోయాడు.

"తొందరపడకు. రేపు కదా మన ప్రయాణం. వీడ్కోలు ఇవ్వడానికి రేపు వస్తారేమో చూద్దాం! మనం సరే, కనీసం కూతుర్ని చూడ్డానికయినా రాకపోతాడా చెప్పు? ఈ సారి కొన్ని గౌరవ మర్యాదలు పాటించాలని నేను సూచిస్తాను. ఇంతవరకూ వారి పద్ధతి ప్రకారమే మనం నడుచుకున్నాం. ఇటుపైన మన పద్ధతులూ పాటించాలని హెచ్చరిద్దాం. ఒంటి చేయి కరచాలనాలు వంటికి మంచిది కాదని చెబుదాం." దేవరాయల నిర్లక్ష్యంపై గిసుదరాజూ మండిపడ్డాడు.

ఆ మర్నాడు ప్రాయాణాలకి కావల్సిన ఏర్పాట్లు చెయ్యడానికి దేవరాయల అధికారులూ, సేవకులూ వచ్చారు తప్ప దేవరాయలు రాలేదు. చాలా సేపు ఫిరోజ్‌షా ఎదురు చూసాడు కానీ ఫలింత లేకపోయింది.

బయల్దేరబోతూండగా మంజరికేమయినా తెలుసేమోనని అడగమని దుబాసీనిచ్చి గిసుదరాజుని పంపించాడు.

"నేను మా తండ్రి వస్తారని ఎదురు చూడడం లేదు. మా తల్లిగారు రాలేదన్నదే నాకు మనసు పీకుతోంది. మా తండ్రిగారు రాలేదని సుల్తాన్ కోప్పడుతున్నారని విన్నాను..ఇందులో నా తప్పేమీ లేదు. నాకు భయమేస్తోంది..." ఏడుస్తూ అంది.

గిసుదరాజుకి అర్థమయ్యింది విషయం. దేవరాయలు అసలు రంగు మెల్లగ బయటపడుతోంది. కానీ రాయచూరు ఒప్పందం చేసుకోవడానికి గుల్బర్గా వచ్చినప్పుడు తగిన సమాధానం చెప్పాలని నిర్ణయించుకున్నాడు.

"నీకెటువంటి ఆపదా మా వల్ల చేకూరదు. చేతకాని మగాళ్ళ ప్రవర్తనకి ఆడవాళ్ళని శిక్షించే సంస్కృతి సున్నీ మతానికి లేదు." అని చెప్పి గిసుదరాజు వెనుదిరిగాడు.

బయల్దేరేముందు మంజరి ఫిరోజ్‌షాని చూసి భయపడినా, సుల్తాన్ మాత్రం ఆమె ఎడల కోపం ప్రదర్శించలేదు.

మెల్లగా ఫిరోజ్‌షా సైన్యంతో కలిసి గుల్బర్గా వైపు పయనమయ్యాడు.

కావాలనే దేవరాయలు తనని అవమానపరిచాడని అనుకున్నాడు. ఇంతవరకూ సజావుగా జరిగిన ఈ ప్రహసనంలో మొదటి తప్పటడుగు వేసింది దేవరాయలే!

నిర్లక్ష్యం నిప్పు లాంటిది. చిన్నదయినా చిట్టడవిని కూడా దహించగలదు.

కొత్త వివాదాన్ని రేపుతూ ఫిరోజ్‌షా రథాలు గుల్బర్గా వైపుగా దూసుకుపోయాయి.

*00000000000*

**(కొనసాగింపు వచ్చేసంచికలో)**

Click here to share your comments on this serial